సాంకేతికతను అందించేందుకు కృషి

జీఎస్ఐటీఐలో శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న డాక్టర్ మాథ్యూజోసెఫ్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 5: టాంజానియా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు వివిధ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ) కృషి చేస్తుందని డిప్యూటీ డైరెక్టర్ జనరల్, జీఎస్ఐటీఐ హెడ్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ తెలిపారు. నాగోల్, బండ్లగూడలోని జీఎస్ఐటీఐ కార్యాలయంలో టాంజానియా భూవిజ్ఞాన శాస్త్రజ్ఞుల కోసం ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ)చే స్పాన్సర్ చేయబడిన ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటీఈసీ) కార్యక్రమం క్రింద ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మాథ్యూ జోసెఫ్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. మూడు వారాల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. డైరెక్టర్లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

దైవ చింతనను అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్‌కి సింహాసనాన్ని ఉపేందర్‌రెడ్డి దంపతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని సత్కరించారు. రఘువీర్, దయాకర్‌రెడ్డి, క్రిష్ణారావ్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, రీతూ, సునీలా, సుధా, అన్నపూర్ణ, ఉమ తదితరులు ఉన్నారు. – ఆర్కేపురం

అంగన్ వాడీల బలోపేతానికి కృషి

అంగన్‌వాడి కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మోతి

కందుకూరు, సెప్టెంబర్ 5 : అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఐసీడీఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి తెలిపారు. మండల పరిధిలోని ఊట్లపల్లి అంన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు గుడ్ల నాణ్యత, పౌష్టికాహారం, 3 సంవత్సరాల లోపు పిల్లల తూకం వంటి విషయాలను గర్భిణులు, పాలిచ్చే తల్లులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ సైజు గుడ్లను తీసుకోవద్దని టీచర్లకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రీ స్కూల్ హాజరు శాతం పెంచాలని, అంగన్ వాడీలకు వచ్చే పిల్ల పట్ల శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీడబ్లూఓ పద్మజ. సూపర్‌వైజర్ సబిత పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఎక్కడ?
- గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

ఆర్కేపురం, సెప్టెంబర్ 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చి మాట నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం సరూర్‌నగర్ తాసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని గతంలో కాంగ్రెస్ నాయకులు ప్రకటించారని, ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డలకు ఆసరా ఉంటుందనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ మంచి నిర్ణయంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని తీసుకొచ్చి అండగా నిలిచ్చారని తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం గత ప్రభుత్వం 600 గురుకులాలను ఏర్పాటు చేసి ఉన్నతులుగా తీర్చిదిద్దారన్నారు. కానీ నేటి ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోకపోవడం లేదని, సమస్యలతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అర్హులైన ప్రజలకు ఇస్తామని చెప్పిన 200 కరెంట్ యూనిట్లు, గ్యాస్ సబ్సిడీ కొంత మందికే వస్తుందని, ఇది అందరికీ వర్తించే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పథకాలు రానివారు తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పథకాలు వచ్చే విధంగా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ వేణుగోపాల్, ఉప తాసీల్దార్ ఆదిత్య, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, నియోజకవర్గ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, ఆకుల అరవింద్ కుమార్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, ఎంఏ సాజీద్, సిరిపురం రాజేశ్‌గౌడ్, కంచర్ల శేఖర్, బండారి మల్లేశ్ ముదిరాజ్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, ప్రత్యూష్, స్వప్నారెడ్డి, సుశీలారెడ్డి తదితరులు ఉన్నారు.

సొంత నిధులతో డ్రైనేజీ నిర్మాణం

కందుకూరు, సెప్టెంబర్ 5 : సొంత నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు మండల పరిషత్ మాజీ వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ కాలనీలోని 8వ వార్డులో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గుర్తించి అట్టి పనులను పరిశీలించిన అనంతరం 50 మీటర్ల వరకు తన సొంత నిధులతో నిర్మిస్తానని పేర్కొన్నారు. తక్షణమే పనులను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. 50 మీటర్ల వరకు నిధులు తానే భరిస్తానని చెప్పారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన పొలెమోని రాజు మృతి చెందడంతో వారి కుంటుబానికి రూ. 5 వేలు, బొర్ర అచ్చమ్మ మృతి చెందడంతో వారి కుంటుబ సభ్యులకు రూ. 2 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ ఎండీ అష్టల్ బేగ్, సీనియర్ నాయకుడు వరికుప్పల బాబు, అవకగల్ల దర్శన్, మహేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేదునూరులో డ్రైనేజీని పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఎస్ఆర్ఎల్ కాలనీ పార్కు స్థలం పరిశీలన

కొత్తపేట డివిజన్ ఎస్ఆర్ఎల్‌కాలనీలోని పార్కు స్థలం వివరాలను హైడ్రా అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, కాలనీవాసులు

ఎల్బీనగర్, సెప్టెంబర్ 5 : కొత్తపేట డివిజన్ రామలింగేశ్వరకాలనీ తెలంగాణ పార్కు సర్వే నంబర్ 143,146,159,160లలోని 3ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమి ఉండగా అన్యాక్రాంతమై కేవలం 19 గుంటలు మాత్రమే ఉన్నదని, ఈ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు గురువారం కొత్తపేట తెలంగాణ పార్కులో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఇటీవలే ఈ స్థలంపై ఫిర్యాదు చేశారు. హైడ్రా తాసీల్దార్ హైమ, అధికారి సతీశ్, ఉప్పల్ ఆర్ఐ వాణి, సర్వేయర్ వెంకటేశ్ తదితరులు తెలంగాణ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మూడు ఎకరాలు 12 గుంటల ప్రభుత్వ భూమి ఉండగా ప్రస్తుతం 19 గుంటలకే పరిమితం అయ్యిందని ఈ భూమిని వెలికి తీసి ప్రజలకు ఉపయోగంలోకి తేవాలని అన్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యేందుకు రెవెన్యూ అధికారులే కారణమని ఆరోపించారు. హైడ్రా అధికారులు వెంటనే సర్వే నిర్వహించి మొత్తం భూమిని వెలికి తీయాలని కాలనీవాసులు, కార్పొరేటర్ పవన్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్‌తో పాటుగా పరిసర కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమజ్జన కొలనుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

పెద్ద చెరువువద్ద కొలనును పరిశీలిస్తున్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, చిత్రంలో కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 5: వినాయక విగ్రహాలను నిమజ్జనాలు చేసే చెరువులు, కొలనుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. వినాయక నిమజ్జనాల ఏర్పాట్లలో భాగంగా గురువారం ఆమె అధికారులతో కలిసి నాగోల్ చెరువు, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువులను సందర్శించారు. మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ మేయర్‌తో కలిసి పర్యటించి నిమజ్జనాల ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఈనెల 7న వినాయక చవితి రోజు నుంచి 18వ తేదీ వరకు వినాయక ఉత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. ఉత్సవాలో వినాయక నిమజ్జనాలు చేసేందుకు చెరువులకు వచ్చే మార్గాల్లో రోడ్ల గుంతలను పూడ్చడం, అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడం వంటి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. కొలనులు, చెరువుల వద్ద క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నిమజ్జనాలకు వచ్చే భక్తులు జీహెచ్ఎంసీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. చెరువుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ వినాయక ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ లవాసుల సమస్యలపై నగర మేయర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ. 3.68 కోట్లతో చేపట్టాల్సిన సీసీ, బీటీ రోడ్ల ప్రతిపాదనలను కార్పొరేటర్ నగర మేయర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు. పెద్ద చెరువులోకి మురుగునీరు చేరకుండా ఉండేందుకు బాక్స్‌టైప్ ట్రంకులైన్ పనులను పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్, ఎల్బీనగర్ జోన్ ఎస్ఈ అశోక్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ కృష్ణకుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ అన్నపూర్ణ, ఎలక్ట్రికల్ ఈఈ పున్ననాయక్, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ రంజిత్, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజని తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

లింగోజిగూడ వార్డు కార్యాలయంలో భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ధర్వల్లి రాజశేఖర్‌రెడ్డి

చంపాపేట, సెప్టెంబర్ 5 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని కాంగ్రెస్ జీహెచ్ఎంసీ ప్లోర్‌లీడర్ లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్వల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న మట్టి గణపతి విగ్రహాల పంపిణీలో భాగంగా గురువారం లింగోజిగూడ డివిజన్ వార్డు కార్యాలయంలో గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పాల్గొని డివిజన్ పరిధిలోని పలు కాలనీల భక్తులకు గణపతి విగ్రహాలను పంచిపెట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరోమారు శుక్రవారం వార్డు కార్యాలయంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, కరుణ్‌కుమార్, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చిప్పలపల్లిలో ఉపాధ్యాయులను సన్మానించిన లలితకుమార్

కందుకూరు, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులను సన్మానించారు. మండల పరిధిలోని చిప్పలపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఎచ్ఎం రామ్‌దాస్, ఉపాధ్యాయులు రాజు, పుష్పలత, సుదా, శ్రీరామ్, అంగన్‌వాడీ టీచరు రేణుకలను మాజీ ఎంపీటీసీ లలిత కుమార్, మాజీ సర్పంచ్ బాలక్రిష్ణ సన్మానించారు. విద్యార్థులు, మాజీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో..

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం మోహన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. బీజేపీ నాయకుడు బొల్గం యశ్‌పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా మోహన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ కట్టా ఆంజనేయులు, ఉపాధ్యాయురాళ్లు సునీత, సంధ్య, అరుణజ్యోతిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, టాకూర్ తరుణ్ సింగ్, సంప్రీతి, చక్రి , బాబ్జీ, అవినాష్, వరుణ్, వెంకటేశ్, విష్ణు, యశ్వంత్, అజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

– ఎల్బీనగర్, సెప్టెంబర్ 5

విజయభాస్కర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

హైదరాబాద్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఎస్. విజయ భాస్కర్‌కు గురువారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దుర్గెట్టి, జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి పాల్గొన్న అవార్డుల ప్రదానంలో అందజేసినట్లు తెలిపారు. – సైదాబాద్

ఉపాధ్యాయ దినోత్సవం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని వనస్థలిపురం లయోలా స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను లయోల విద్యా సంస్థల చైర్మన్ రంగినేటి వెంకట్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత విశేషాలను ఆయన వివరించారు. – వనస్థలిపురం

ఎంహెచ్ఎం కోర్సు గడువు పెంపు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 5 : నిమ్స్‌లో మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు లో దరఖాస్తుకు గడువును పెంచినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, కోర్సు అకాడమిక్ ఇన్‌చార్జి, లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేశ్ తెలిపారు. గురువారం సూపరింటెండెంట్ ఆఫీస్‌లో మీ డియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. వందలాది మంది కార్పొరేట్ హాస్పిటల్స్, ఫార్మా, మెడికల్ టూరిజం, ఇన్సూరెన్స్ సంస్థల్లో సీఈవో, జీఎం లాంటి ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. రెండున్నర సంవత్సరాల కాల పరిమితి కలిగిన ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ ఉండాలని, ఈ నెల 16 లోపు ఆన్‌లైన్‌లో, హార్డ్ కాపీస్‌తో 18న సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. హాల్ టికెట్లు అక్టోబర్ 9న అందుబాటులో ఉంటాయని, అదే నెల 9న ఎంట్రన్స్ టెస్ట్ ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 3 , దివ్యాంగులకు 5 సంవత్సరాల సడలింపు ఉంటుందన్నారు. జనరల్‌లో 40 శాతం, ఎస్సీ, ఎస్టీలు 30 శాతం మార్కులు వస్తే అర్హత సాధిస్తారని, రెండేండ్ల కోర్సుతో పాటు నిమ్స్‌లో ఆర్నెళ్లు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 31 నాటికి 30 ఏండ్లు దాటవద్దన్నారు. వివరాలకు www. nimsedu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కందుకూరు, సెప్టెంబర్ 5 : వ్యక్తి మృత దేహం లభ్యమైనట్లు కందుకూరు సీఐ సీతారామ్ తెలిపారు. మండల పరిధిలోని లేమూరు గ్రామం నుంచి సరస్వతిగూడ వెళ్లే దారిలో విట్టల్‌రెడ్డి వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కారోబార్ సుకుమార్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి చూడగా వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. సుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిమజ్జనాలకు ఏర్పాట్లు ముమ్మరం

ఆదిత్యనగర్ కాలనీలో ర్యాంపును జేసీబీతో తొలగిస్తున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 5 : వినాయక నిమజ్జనాలకు ఏర్పాట్లను జీహెచ్ఎంసీ అధికారులు ముమ్మరం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్దచెరువుకు వినాయక విగ్రహాలను తీసుకువచ్చే మార్గంలో అడ్డుగా ఉన్న ర్యాంపులను తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని పర్యవేక్షణలో మన్సూరాబాద్ చౌరస్తా నుంచి ఆదిత్యనగర్, భవానీనగర్ కాలనీ, మధురానగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డును ఆక్రమించి వేసిన ర్యాంపులను జేసీబీ సహాయంతో తొలగించారు. ఇష్టానుసారంగా రోడ్డును ఆక్రమించి వాహనదారులకు ఇబ్బందులు సృష్టించే వారిని ఉపేక్షించేది ఉండదని ఏసీపీ పావని హెచ్చరించారు. కూల్చిన ర్యాంపులను తిరిగి నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతల పూడ్చివేతకు చర్యలు

వెంకటాద్రినగర్‌లో రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

సైదాబాద్, సెప్టెంబర్ 5 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్, ఎల్‌సీహెచ్ కాలనీ, ఎస్బీహెచ్ బ్యాంక్ కాలనీల్లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి జీహెచ్ఎం, జల మండలి, విద్యుత్‌శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ఎస్బీచ్ బ్యాంక్ కాలనీలో గుంతల మయంగా మారిన రోడ్లను పరిశీలించి, పాడైన ప్రాంతాల్లో పనులను చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. వినాయక చవితిని దృష్టిలో పెట్టుకొని రోడ్లపై గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా వెంకటాద్రి నగర్‌లో మురుగునీటి ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని జల మండలి అధికారులకు సూచించారు. ఎల్‌సీహెచ్ కాలనీలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా బంచ్ కేబుళ్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ జలమండలి మేనేజర్ శ్రావణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, విద్యుత్ ఏఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కందుకూరు, సెప్టెంబర్ 5 : పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ సీతారామ్ తెలిపారు. మండల పరిధిలోని ఎంఆర్ఆర్‌లో మండల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాల సందర్భంగా మండల పాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. క్యూ లైన్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు ఆటంకం కలుగకుండా చూసుకోవాలనిఅన్నారు. మండలపాల వద్ద నిర్వాహకులు తగిన జాగ్రతలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సైలు సైదులు, పరమేశ్, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కందుకూరులో మాట్లాడుతున్న సీతారామ్

గురుపూజోత్సవం

సుబాష్‌చంద్రబోస్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్వేపల్లి రాధా కృష్ణ జన్మదినం సందర్భంగా గుపుజోత్సవాన్ని అంగన్ వాడీ టీచర్ బి. యశోధ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పాటలు పాడి వినిపించారు. క్రిష్ణవేణి, వర్షిణి, మణి తది తరులు ఉన్నారు. – బడంగ్‌పేట, సెప్టెంబర్ 5

డిప్యూటీ మేయర్ నివాసానికి త్రిపుర గవర్నర్

నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ ఇంటికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి గురువారం వచ్చారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని పూసలబస్తీలోని ఆయన నివాసానికి విచ్చేసి కుటుంబ సభ్యులను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సుభాష్ చందర్జీ ఇచ్చిన విందును స్వీకరించారు. మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఇంద్ర సేనారెడ్డిని మార్యాద పూర్వకంగా కలిశారు. – సైదాబాద్, సెప్టెంబర్ 5

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

విద్యార్థులు కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని శివాని మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తపేటలోని శివాని మహిళా కళాశాల ప్రైజర్స్ డే వేడుకలను కొత్తపేటలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సాంబశివరావు, ప్రిన్సిపాల్ అనిత తదితరులు ఉన్నారు. – ఆర్కేపురం, సెప్టెంబర్ 5

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు నా క్లయింటు అయిన ఆరంగురు ప్రసన్న, W/o. శ్రీకాంత్, నివాసం: ఆంధ్రా బ్యాంక్ కాలనీ, గడ్డి అన్నారం, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్. గారు యొక్క సూచనల మేరకు ఈ క్రింది బహిరంగ ప్రకటన చేయుచున్నాను.

నా క్లయింట్ ఈ క్రింద తెలుపబడిన షెడ్యూలు ఆస్తిని దాని యజమాని అయిన ద్రోణంరాజు పద్మావతి, W/o. రామకృష్ణ అను వారి దగ్గర 100 గజాల ఇల్లును, Sy.No. 79/ఆ, ప్లాట్ సంఖ్య: 529 సౌత్ పార్ట్, బ్లాక్ సంఖ్య:1, వార్డ్ సంఖ్య:2, నరసింహ స్వామి కాలనీ, నాగోల్, ఉప్పల్ మండలం, రంగారెడ్డి జిల్లా. ఉత్తరం: ప్లాట్ సంఖ్య: 529 ఉత్తరం పార్ట్, దక్షిణం: ప్లాట్ సంఖ్య: 528, తూర్పు: ప్లాట్ సంఖ్య: 514, పడమర: 40' Wide Roadను కొనుగోలు చేసి, విక్రయ అగ్రిమెంట్ వ్రాయించుకొని బయానాగా కొంత డబ్బులు ఇచ్చియున్నాను. ఇట్టి ఇల్లును నా క్లయింట్ రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు పోవుచున్నాడు. ఇట్టి ఇల్లు విక్రయంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ క్రింది చిరునామాపై వారం రోజులలో సంప్రదించగలరు.

లేనిచో ఎలాంటి అభ్యంతరాలు లేవు అని భావించి నా క్లయింట్ ఇట్టి ఇల్లుపై ఉన్న పూర్తి విక్రయ దానం చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకొనబడును.

సం/– రావోలు భాస్కర్ (న్యాయవాది)
కళ్యాణ్ నగర్, గడ్డి అన్నారం రోడ్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్
ఫోన్: 9848498029